క్లుప్తంగా

విద్యార్థులకు బ్యాంక్ అకౌంట్లు



అకౌంట్లను అందజేస్తున్న బ్యాంక్ మేనేజర్

బోనకల్: మండల పరిధిలోని రావినూతల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎస్‌బీఐ బ్యాంక్ ఆధ్వర్యంలో సోమవారం సేవింగ్ బ్యాంక్ అకౌంట్లను బ్యాంక్ మేనేజర్ మల్లిక్, క్యాషియర్ హబీద్‌పాషా అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది ఉపేందర్, హిందూజా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తులు..



దుస్తులు అందజేస్తున్న రజిత

ఎర్రుపాలెం: మండలంలోని రాజుపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నారాయణపురం గ్రామానికి చెందిన కోగంటి సత్యనారాయణ కుమార్తె రజిత క్రీడా దుస్తులను సోమవారం అందజేశారు. హెచ్‌ఎం యశోద, పీఈటీ తల్లపరెడ్డి గోపిరెడ్డి ఉన్నారు.

ఎఫ్‌ఎల్‌ఎన్ శాంపిల్ సర్వే

ఏన్కూరు: మండల కేంద్రంలోని పీఎస్ పాఠశాలలో సోమవారం ఎఫ్‌ఎల్‌ఎన్ సర్వే నిర్వహించారు. చిన్నారులతో చదివించడం, అక్షరాలు గుర్తించడం, పదాలు రాయించడం వంటి పరీక్షలు నిర్వహించారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం సైదయ్య, ఫీల్డు ఇన్వెస్టిగేటర్ బి.సింధు, సీఆర్‌పీ కృష్ణ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాయితీతో ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ

తల్లాడ: ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా 2020 సంవత్సరంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు ఈ నెల 31 లోపు క్రమబద్ధీకరణ చేసుకుంటే 25 శాతం రాయితీ పొందవచ్చని తహసీల్దార్ టి.సురేష్‌కుమార్, ఎంపీడీఓ సురేష్‌బాబు సోమవారం ప్రకటనలో తెలిపారు. క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్న వారంతా సంబంధిత పంచాయతీ కార్యదర్శిని సంప్రదించి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

జూలూరుపాడు: రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలైన ఘటన సోమవారం మండలంలో చోటుచేసుకుంది. ఏన్కూరు మండలం భద్రుతండాకు చెందిన మొగిలి మల్లేశ్ సోమవారం కొత్తగూడెం నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తున్నాడు. జూలూరుపాడు మండలంలోని సాయిరాంతండా సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడగా తలకు గాయమైంది. క్షతగాత్రుడిని 108 వాహనంలో కొత్తగూడెంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు.

బాలికల సంక్షేమంపై దృష్టి

ఎర్రుపాలెం: బాలికల సంక్షేమం, చదువులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలని విద్యాశాఖ ఏఎంఓ రవికుమార్ సూచించారు. ఈ మేరకు సోమవారం మండలకేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. మధ్యాహ్న భోజనం అమలు తీరును పరిశీలించారు. మరుగుదొడ్ల మరమ్మతులు పెండింగ్ ఉండడంపై సూపరింటెండెంట్ కె.సరితను ప్రశ్నించారు. త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. రిజిష్టర్లను పరిశీలించి పాఠశాల నిర్వహణ తీరు మరింతగా మెరుగుపరుచుకోవాలన్నారు.

14 నుంచి అంకమ్మజాతర



ముదిగొండ: మండలపరిధిలోని కమలాపురంలో అంకమ్మదేవాలయం వద్ద ఈ నెల 14నుంచి 19 వరకు శ్రీ అంకమ్మతల్లి, శ్రీ మహాలక్ష్మీ, శ్రీ మద్దిరావమ్మ, పెద్దమ్మ అమ్మవార్ల జాతర నిర్వహిస్తున్నట్టు దేవాలయ కమిటీ ప్రతినిధులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14న అమ్మవార్ల నిధి ఎక్కటం, అంకురార్పణ కార్యక్రమంతో జాతర ప్రారంభమై 19న చంద్రపట్నం, బండారు వసంతోత్సవంతో ముగుస్తుందని తెలిపారు.

అమరుల ఆశయాలను సాధించాలి

చింతకాని: అమరవీరుల ఆశయాలను సాధించే దిశగా కార్యకర్తలు ముందుకు సాగాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని నాగిలిగొండలో పార్టీ నాయకులు పంది నారాయణ వర్ధంతి సభ సందర్భంగా స్మారక స్థూపం వద్ద నివాళులర్పించారు. సీపీఐ జిల్లా కమిటీ సభ్యులు ఏపూరి రవీంద్రబాబు, మండల కార్యదర్శి మల్లిఖార్జున్‌రావు, వెంకటనర్సయ్య, షేక్ చినజాన్, రమేష్, మురార్జి, వజీర్, నాగేశ్వరరావు, శేషగిరిరావు, సురేష్ ఉన్నారు.

భరోసానిస్తున్న మక్కసాగు

కాసులు కురిపిస్తున్న సీడ్ మొక్కజొన్న

- ముమ్మరంగా కైలు..
- ఎకరానికి 35–40 క్వింటాళ్ల దిగుబడి.. రూ.లక్షకు పైగా ఆదాయం
- విత్తన కంపెనీల ప్రోత్సాహంతో మేలు



మొక్క జొన్న పైరులో కంకులు తొలుస్తున్న కూలీ

తల్లాడ: ఈ ఏడాది రబీలో సాగు చేసిన మొక్కజొన్న దిగుబడి ఆశాజనకంగా ఉంది. తక్కువ పెట్టుబడితో తక్కువ వ్యవధిలోనే పంట చేతికొచ్చే మొక్కజొన్న రైతులకు కాసులు కురిపిస్తోంది. ఖరీఫ్‌లో సాగు చేసిన పత్తి పైరు అధిక వర్షాల వల్ల పంట దిగుబడి లేక నష్టపోయిన రైతులు పత్తిని తొలగించి మొక్కజొన్న సాగు చేశారు. డిసెంబరు మొదటి వారం వరకు సీడ్ మొక్కజొన్న సాగు చేశారు. రైతులు ఆలోచనకు అనుగుణంగా ఈ ఏడాది మొక్కజొన్న పంట దిగుబడి ఆశాజనకంగా ఉంది.

ముమ్మరంగా కోతలు..

మండలంలో రబీలో సాగు చేసిన సీడ్ మొక్కజొన్న కోత కొచ్చింది. వారం రోజులుగా మొక్కజొన్న పంట కైలు చేస్తున్నారు. కొణిజర్ల, బోనకల్, ఏన్కూరు, జూలూరుపాడు మండలాల నుంచి కూలీలను తెప్పించుకొని రైతులు మొక్కజొన్నను విరుస్తున్నారు.

35 నుంచి 40 క్వింటాళ్ల దిగుబడి

మండలవ్యాప్తంగా రైతులు ఆడ, మగ సీడ్ 2,500 ఎకరాల్లో మొక్క జొన్న సాగు చేశారు. గత నవంబర్‌లో సాగు చేసిన పైరు ఇప్పుడు కోతకొచ్చింది. ఎకరానికి 35 నుంచి 40 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. 120 రోజులకే పంట చేతికొస్తుంది. క్వింటా రూ.3,200 ధర పలుకుతుంది. విత్తన కంపెనీలు పండించిన పంటను తీసుకెళ్లి వారికి డబ్బులు చెల్లిస్తుంది. ఎకరానికి 1.20 లక్షల ఆదాయం సమకూరుతుంది. అందులో పెట్టుబడి రూ.30 నుంచి రూ.40 వేలు వరకు అవుతుండగా ఎకరానికి రూ.80,000 నుంచి రూ.90,000 వరకు ఆదాయం సమకూరుతుంది. ఇలా తక్కువ కాలంలో, తక్కువ పెట్టుబడితో ఎకరానికి లక్ష రూపాయల వరకు ఆదాయ సమకూరే మొక్కజొన్న ఈ ఏడాది రైతులకు ఆర్థికంగా భరోసానిచ్చింది.

కంపెనీల ప్రోత్సాహంతో పెరిగిన సాగు



కంపెనీకి తరలించేందుకు సిద్ధంగా ..

గతంలో వందల ఎకరాల్లోనే సాగయ్యే మొక్కజొన్న నేడు వేల సంఖ్యలోకి వెళ్లడానికి విత్తన కంపెనీల ప్రోత్సాహమే. విత్తన కంపెనీలు తొలుత ఫీల్డ్ చూసి విత్తనాలు, పంట వేసిన తర్వాత ఎలాంటి చీడ పీడలు ఆశించినా పురుగు మందులు సరఫరా చేశారు. ఈ విధంగా సీడ్ కంపెనీలు రైతులకు సహకరిస్తుండటంతో రైతులు కూడా మొక్క జొన్న సాగు పట్ల మక్కువ చూపించారు. సీడ్ మొక్కజొన్న కావటంతో కైలు చేయించి సంచుల్లో నింపి ఉంచితే ట్రాక్టర్, లేదా లారీ ద్వారా సీడ్ కంపెనీలు తీసుకెళ్తున్నాయి. దీంతో రైతుకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. కేవలం కూలీల ఖర్చు మాత్రమే రైతులు పెట్టుకోవాలి. మండలంలో బేయల్, పయనీర్, సింగెంటా, అడ్వాంట వంటి రకాలను సాగు చేశారు. ముందుగా సాగు చేసిన మొక్కజొన్న కైలు చేయగా కాస్త ఆలస్యంగా వేసిన పంట వారం రోజుల్లో కోతకొస్తోంది.

10 ఎకరాల్లో సాగు చేశా..



10 ఎకరాలు కౌలుకు తీసుకొని సీడ్ మొక్క జొన్న సాగు చేశా. సీడ్ కంపెనీ ప్రోత్సాహంతో విత్తనాలు, పురుగు మందులు అందజేశారు. ఎకరానికి 35 క్వింటాళ్ల పైగానే దిగుబడి వచ్చింది. క్వింటా రూ.3,200 ధర పలికింది. కైలు చేసిన తర్వాత కంపెనీ వారే సీడ్ మొక్కజొన్నను తీసుకెళ్లి డబ్బులు చెల్లించారు.

– గూడూరు నర్సిరెడ్డి, రైతు, నారాయణపురం

రోజుకు రూ.600 కూలి..



సీడ్ మొక్క జొన్న తొలిచినందుకు ఎకరానికి రూ.10 వేలు ఇస్తున్నారు. పది మంది ముఠాగా ఏర్పడి రోజుకు ఎకరం, ఎకరంన్నరలో కంకులు కోస్తున్నాం. వీటిని ట్రాక్టర్‌పై లేదా ఇతర వాహనంపై ఎక్కించాలి. కూలీ గిట్టుబాటు అవుతుంది. బోనకల్ మండలం నుంచి వచ్చి మొక్కజొన్న కైలు చేస్తున్నాం.

– వెంగళ రాములు, కలకోట, వ్యవసాయ కూలీ

సీడ్ మొక్కజొన్న లాభదాయకమే



పెట్టుబడి తక్కువ, విత్తన కంపెనీల సహకారం ఉండటం వల్ల రైతులకు సీడ్ మొక్క జొన్న సాగు లాభదాయకంగానే ఉంటుంది. ఈ ఏడాది రబీలో మండలంలో 2,500 ఎకరాలో సాగు చేయగా అందులో 2,400 ఎకరాలు సీడ్ మొక్కజొన్నే. వాణిజ్య పంటల కేంటే ఈ ఏడాది సీడ్ మొక్కజొన్న రైతులకు కలిసొచ్చింది.

– ఎండి.తాజుద్దీన్, ఏఓ, తల్లాడ

భగవద్గీతతో నైతిక విలువలు



విజేతలతో ఏసీపీ, నిర్వాహకులు

సత్తుపల్లిటౌన్: భగవద్గీత వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే పవిత్ర గ్రంథమని విద్యార్థి దశ నుంచే చదవడం అలవర్చుకోవాలని సత్తుపల్లి ఏసీపీ రఘు అన్నారు. ఇస్కాన్ ముంబై వారి ఆధ్వర్యంలో ఇటీవల సత్తుపల్లిలో విద్యార్థులకు భగవద్గీత పుస్తకాలను అందజేసి వాల్యూ ఆఫ్ ఎడ్యుకేషన్ అంశంపై పోటీలు నిర్వహించారు. ఈ మేరకు విజేతలకు సోమవారం జవహర్‌నగర్ శ్రీకృష్ణ మందిరంలో బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్యం నుంచే భగవద్గీత చదవడంతో విద్యార్థులలో మానసిక స్థైర్యం, నైతిక విలువలు, ఆధ్యాత్మిక విలువలు పెంపొందుతాయన్నారు. అనంతరం విజేతలకు అతిథులచే బహుమతులు, పోటీలలో పాల్గొన్న వారికి ప్రశంస పత్రాలు అందచేశారు. సత్తుపల్లి డివిజన్ ప్రైవేట్ పాఠశాలల సంఘం అధ్యక్షులు పసుపులేటి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఈఓ నక్కా రాజేశ్వరరావు, ఇస్కాన్ ప్రతినిధి నర్సింహ్ పూజదాస్, ఆలయ కమిటీ అధ్యక్షులు కంచేటి రమేష్, సృజన సంస్థ నిర్వాహకులు రామకృష్ణ, మధుసూదన్‌రాజు, పాఠశాలల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సావిత్రీబాయి జీవితం ఆదర్శం



మాట్లాడుతున్న అప్పారావు

మధిర: మహిళలకు సావిత్రీబాయి పూలే జీవితం ఆదర్శం కావాలని మడుపల్లి హరిజనవాడ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం లింగంపల్లి అప్పారావు అన్నారు. సావిత్రీబాయి పూలే వర్ధంతి సందర్భంగా పాఠశాలలో సోమవారం ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేయాలి

మధిర: మండలంలో మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేయాలని మధిర మత్స్యకారుల సొసైటీ సభ్యులు నాగనబోయిన రామారావు కోరారు. హైదరాబాద్‌లోని మత్స్యభవన్‌లో మత్స్యసహకార కార్పొరేషన్ సంస్థ చైర్మన్ మెట్టు సాయికుమార్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. సంస్థ చైర్మన్ మాట్లాడుతూ సభ్యులకు కార్పొరేషన్ అండగా ఉంటుందని, దళారులను పట్టించుకోవద్దన్నారు. అనంతరం చైర్మన్‌ను సన్మానించారు. దుబాసి యేసు, రెడపంగి ఏసు, రవి, కొచ్చర్ల దాసు ఉన్నారు.

తహసీల్దార్‌కు వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తల్లాడ: మండలంలోని పలు గ్రామాల్లో నిర్మిస్తున్న రహదారులు అసంపూర్తిగా ఉన్నాయని, వాటితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ నాయకులు అన్నారు. ఈ మేరకు రోడ్ల నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణిలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు చల్లా నాగులు, నాయకులు సంగీతం సాయిచంద్, వేము అశోక్, నరేష్ పాల్గొన్నారు.

అన్నదానం

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని వెంగళరావునగర్ శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి శివాలయంలో సోమవారం శివలింగానికి అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు రామడుగు గురుబ్రహ్మాచార్యులు, పద్మ దంపతులు భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాసు, రజని, శరత్, శంకర్ పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

వేంసూరు: మండల పరిధిలోని లింగపాలెం గ్రామంలో కొలువుదీరియున్న శ్రీ హరిహర క్షేత్ర ఆలయ 5 వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నారాయణ సేవ, గ్రామోత్సవం, మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కల్యాణ వేడుకలు ప్రారంభం

వేంసూరు: మండల పరిధిలోని కందుకూరులో శ్రీ వెంకటేశ్వరరావు స్వామి కల్యాణ వేడుకలు సోమవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ మేరకు సోమవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ధ్వజారోహణం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు.

ఆంగ్లంపై పట్టు సాధించాలి

ఎర్రుపాలెం: విద్యార్థులు ఆంగ్లంపై పట్టు సాధించాలని ఇంగ్లీష్ రిసోర్స్‌పర్సన్ ఎం.రామ్‌ప్రదీప్ సూచించారు. సోమవారం మామునూరు గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల భాషపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంగ్లీష్ నేర్చుకునే క్రమంలో తప్పులు రావడం సహజమని, వాటి గురించి భయపడొద్దని, రోజూ ఆంగ్ల దినపత్రికలు చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం జి.శ్యాంబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన



పంటలు పరిశీలిస్తున్న అధికారులు

ఏన్కూరు: మండలంలోని టీఎల్‌పేట, జన్నారం, గ్రామాల్లో పొలాలను తహసీల్దార్ సీహెచ్.శేషగిరిరావు, ఏఓ నరసింహారావు సోమవారం పరిశీలించారు. ఎస్‌ఎస్‌పీ ఆయకట్టు పరిధిలో వరి, మొక్కజొన్న సాగు చేసిన పంట పొలాలను వారు పరిశీలించారు. సాగునీటికి జాగ్రత్తగా, పొదుపుగా వాడుకోవాలని, వృథాగా బయటకు వదిలి వేయవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈలు నవీన్, రంజిత్ , ఏఈఓ నవ్య పాల్గొన్నారు.

సంతాపం

తల్లాడ: మండలంలోని బిల్లుపాడు మాజీ ఎంపీటీసీ నల్లమోతు మాలతి(49) సోమవారం మృతి చెందారు. ప్రస్తుతం మాలతి ఖమ్మంలో నివాసముంటున్న ఆమె కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. 2014–19లో ఎంపీటీసీగా పనిచేసిన మాలతికి ఇద్దరు పిల్లలు ఉండగా, ఆమె మృతిపై పలువురు సంతాపం తెలిపారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి



మహాదప్పు ప్రదర్శనలో నాయకులు

సత్తుపల్లి: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించకుండా ఉద్యోగ నియామకాలు చేపడితే కాంగ్రెస్ ప్రభుత్వానికి పతనం తప్పదని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఏపూరి వెంకటేశ్వరరావు హెచ్చరించారు. సత్తుపల్లి పట్టణంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మాదిగల ఆత్మగౌరవ మహాడప్పు ప్రదర్శన సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొలికపోగు వెంకటేశ్వరరావు, అశోక్, కూరపాటి సునీల్, అంజయ్య, ముత్తారావు, గోళ్లమూడి శ్రీనివాస్, బాలస్వామి, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, రాజేష్, నవీన్ పాల్గొన్నారు.

రిలే దీక్షలు..

ఏన్కూరు: ఎస్సీ వర్గీకరణ చేసే వరకు నియామక పరీక్షలు, ఉత్తర్వులు నిలిపి వేయాలని డిమావండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు యంగల నరేష్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్ ఎదుట నిరవధిక రిలే దీక్షలు ప్రారంభించారు. గొర్ల రామకృష్ణ, రాజ్‌కుమార్, సైదులు, సురేష్, రాజేష్, రాకేష్, ప్రసన్న కుమార్, సురేందర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు రూ.700 కోట్లు

- సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి: అధికారంలోకి వచ్చిన పదిహేను నెలల్లోనే నియోజకవర్గంలో రూ.700 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్టు ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి వెల్లడించారు. క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలోని 25 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి వర్గానికి రూ.200 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. వేంసూరు మండలం కల్లూరుగూడెంలో రూ.240 కోట్లతో పామాయిల్ ఫ్యాక్టరీ త్వరలో చేపట్టనుండగా, రూ.2 కోట్ల సింగరేణి నిధులతో సత్తుపల్లి జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి టెండర్లు పూర్తయ్యాయన్నారు. రూ.2 కోట్లతో వేంసూరు రోడ్డులో షాపింగ్ కాంప్లెక్స్, రూ.80 లక్షలతో సెంట్రల్ లైటింగ్, షాదీఖానా, క్రిస్టియన్ భవనం, అంబేడ్కర్ భవనం పనులు మొదలువుతాయని, పెనుబల్లి మండలంలో పులిగుండాలను టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేస్తున్నామన్నారు. కాగా, స్వయం సంఘాల మహిళల అభివృద్ధికి ఆర్టీసీ బస్సులు, సోలార్ యూనిట్లు, గోదాంలు కేటాయించాలని నిర్ణయించడమే కాక తనను స్టేట్ లెవల్ హైపవర్ విజిలెన్స్ మానటరింగ్ కమిటీ సభ్యులుగా నియమించడంపై సీఎం రేవంత్‌రెడ్డికి ఆమె ధన్యవాదాలు తెలిపారు.

డిప్యూటీ సీఎం దృష్టికి సమస్య

సత్తుపల్లి మండలం కిష్టారం అంబేద్కర్‌నగర్ కాలనీ వాసులు సైలో బంకర్‌తో పడుతున్న ఇబ్బందులను డిప్యూటీ సీఎం మల్లుభట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు. దెబ్బతిన్న ఇళ్ల స్థలంలో నూతన ఇల్లు మంజూరుకు సింగరేణిపై ఒత్తిడి తీసుకొస్తామని చెప్పారు. మార్కెట్ చైర్మన్లు దోమ ఆనంద్‌బాబు, భాగం నీరజచౌదరి, నాయకులు నర్సింహారావు, మందపాటి ముత్తారెడ్డి, ఉడతనేని అప్పారావు, వంకాయలపాటి వెంకటేశ్వరరావు, తోట సుజలరాణి, గాదె చెన్నారావు, ఎండీ.కమల్‌పాషా, సుబ్బారెడ్డి, పసుమర్తి చందర్‌రావు, దూదిపాల రాంబాబు, గఫార్‌ఖాన్ పాల్గొన్నారు.

ఐకేపీ స్టాళ్ల ప్రారంభం..

సత్తుపల్లి ఐకేపీ కార్యాలయం ప్రాంగణంలో మండలంలోని స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల స్టాళ్లను ఎమ్మెల్యే రాగమయి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు. ఎంపీడీఓ నాగేశ్వరరావు, తహసీల్దార్ యోగేశ్వరరావు, ఐకేపీ అధికారులు సత్యనారాయణ, మహిళా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేర్చిన ఘనత కాంగ్రెస్‌దే..

వేంసూరు: ఏళ్ల తరబడి సొంతింటి కోసం ఎదురు చూస్తున్న నిరుపేదల కల నెరవేర్చిన ఘనత కాంగ్రెస్‌దేనని ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. మండలంలోని ఎర్రగుంటపాడులో రూ.94లక్షల ఎస్టీ ప్లాన్ నిధులతో చేపట్టే పనులతో పాటు చిన్నమల్లెల పరిధి నాయకులగూడెంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కాసరి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు పుచ్చకాయల సోమిరెడ్డి, సత్యనారాయణరెడ్డి, బి.వెంకటేశ్వరరావు, షైజుద్దీన్, రాఘవరెడ్డి, శ్రీనివాసరావు, జగన్‌మోహన్‌రెడ్డి, ఫక్రుద్దీన్ ఉన్నారు.

ఇంటిగ్రేటెడ్ గురుకులానికి రూ.200 కోట్లు

- వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా: నిరుపేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ గురుకులాలను ప్రకటించిందని, నియోజకవర్గ కేంద్రంలో రూ.200 కోట్ల అంచనా వ్యయంతో ఇంటిగ్రేటెడ్ గురుకుల కళాశాలలకు నిధులు మంజూరయ్యాయని వైరా ఎమ్మెల్యే మాళోత్ రాందాస్ నాయక్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ గురుకులాలు దేశానికే ఆదర్శంగా ఉండబోతున్నాయన్నారు. వైరా రిజర్వాయర్‌లోకి గోదావరి జలాలు అతి కొద్ది రోజులలో చేరనున్నాయన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో సీతారామ ప్రాజెక్ట్ రీ డిజైన్ పేరుతో వేలకోట్లు దండుకున్నారన్నారు. నేడు(మంగళవారం) మండలంలోని పుణ్యపురంలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేయనున్నారన్నారు. ఈ సమావేశంలో మార్క్‌ఫెడ్ మాజీ రాష్ట్ర వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, మాజీ మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, నాయకులు దాసరి దానియేలు, కట్ల రంగారావు, శీలం వెంకటనర్సిరెడ్డి, బొల్ల గంగారావు, ఏదునూరి సీతారాములు, కోసూరి శ్రీనివాసరావు, మచ్చా రామారావు, సీతారాములు, పమ్మి అశోక్, తదితరులున్నారు.

వందశాతం పన్నులు వసూలు చేయాలి



రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ రాంబాబు

చింతకాని: ఇంటిపన్నులను వందశాతం వసూలు చేయాలని డీఎల్‌పీఓ రాంబాబు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండల పరిధిలోని నాగులవంచ పంచాయతీ కార్యాలయాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటి పన్నుల వసూళ్లకు ప్రజలు పంచాయతీ సిబ్బందికి సహకరించాలన్నారు. గ్రామంలో పారిశుధ్య పనుల నిర్వహణ, తాగునీటి సరఫరా గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ పంచాయతీ రికార్డులు, ఇంటి పన్నుల వసూళ్ల రిజిష్టర్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి పర్వీ ఖైసర్, పంచాయతీ కార్యదర్శి చిరంజీవి, సిబ్బంది ఉన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

సత్తుపల్లిరూరల్: సింగరేణి ఆధ్వర్యాన సత్తుపల్లి సింగరేణి క్వార్టర్స్‌లో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబీకులు, కాంట్రాక్ట్ వర్కర్లకు ఖమ్మంలోని శరత్ మ్యాక్సీవిజన్ ఆస్పత్రి బాధ్యులు పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జేవీఆర్ ఓసీ పీఓ ప్రహ్లాద్, నాయకులు జి.నర్సింహారావు, కిషోర్, ప్రసాద్, రామారావు, బాలాజీ, నాగేశ్వరరావు, వెల్ఫేర్ ఆఫీసర్లు విజయ్ సందీప్, కావ్య, వైద్యులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

పశు వైద్యశిబిరం

కొణిజర్ల: మండలంలోని తీగలబంజరలో సోమవారం పశువైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పశుగణాభివృద్ధి శాఖ కార్య నిర్వహణాధికారి డాక్టర్ రూప్ కుమార్ మాట్లాడుతూ.. వ్యవసాయంతోపాటు పశుపోషణ కూడా చేసి అదనపు ఆదాయాన్ని పొందాలన్నారు. అనంతరం కొణిజర్ల మండల పశువైద్యాధికారి డాక్టర్ సంజయ్ రెడ్డి నేతృత్వంలో పశువులకు గర్భకోశ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి ఉచిత మందులు పంపిణీ చేశారు. గోపాలమిత్రల సూపర్‌వైజర్ జె.శంకరయ్య, గోపాలమిత్ర రాజశేఖర్, కృష్ణయ్య, నాగేశ్వరరావు, నరసింహారావు, సైదులు ఉన్నారు.

'ఉపాధి' కల్పించాలి

వైరా: మున్సిపాలిటీ పరిధిలోని నిరుపేదలకు ఉపాధి పనులు కల్పించాలని సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డు పల్లిపాడులో సోమవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. చింతనిప్పు చలపతిరావు, పట్టణ కమిటీ సభ్యులు బత్తిరన్న, శ్రీనాథ్‌బాబు, వెంకటేశ్వరరావు, ఏడుకొండలు పాల్గొన్నారు.

అవగాహన

ఏన్కూరు: పదో తరగతి ప్రీ ఫైనల్ పరీక్షల్లో భాగంగా సోమవారం విద్యార్థులకు ఓఎంఆర్ షీట్‌లపై అవగాహన కల్పించారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం కె.సైదయ్య, ఉపాధ్యాయులు రాఘవరావు, శ్రీధర్, పుల్లయ్య, శంకరరావు, చంద్రప్రకాశ్, వర్జీనియా, హతిరామ్, రామ్మూర్తి, కృష్ణవేణి పాల్గొన్నారు.

భారత్ గెలుపుపై సంబురాలు



కేక్ తినిపించుకుంటున్న అభిమానులు

వైరా: చాంపియన్స్ ట్రోఫీని భారత జట్టు గెలవడాన్ని హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం వైరాలో 1వ వార్డు బీసీ కాలనీలో కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. వీరంశెట్టి సీతారాములు జాకోబ్, ఎలీషా, నవీన్, సామేలు, బాలస్వామి, వెంకన్న, నరసింహారావు, బుజ్జి, శ్రీకాంత్ ఉన్నారు.

నీరందక ఎండుతున్న పొలాలు



రాపల్లె మేజర్ వద్ద వేచి ఉన్న రైతులు

కొణిజర్ల: పంటలకు నీరందక ఎండిపోతున్నాయని, అధికారులు పట్టించుకుని నీరు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు. ఈ మేరకు సోమవారం మండలంలోని పెద్దగోపతి సమీపంలోని రాపల్లె మేజర్ కాల్వ వద్ద రైతులు వారి ఆవేదన వ్యక్తం చేశారు. మేజర్‌కు నీళ్లివ్వకుండా దిగువ బోనకల్ ఎర్రుపాలెం మండలాలకు సాగునీటిని అధికారులు తరలిస్తున్నారని, పంటలు ఎండిపోతున్నా పట్టించుకోట్లేదన్నారు. వారబంధీ విధానంతో పాటు అధికారులు మరో మూడు రోజులు అదనంగా నీటి విడుదల నిలిపి వేశారన్నారు.